

# ఇప్పుడు కావలసింది కన్నీరు కాదు

"ప్రపంచ మహిళా దినోత్సవం కాదు, ఇలాంటి ఉత్సవాలు రోజుకొహటి చేసినా ఈ దేశంలో ఆడది బాగుపడదు. ఛీఛీ" గట్టిగా అరుస్తూ గదిలోంచి బయటి కొచ్చింది దుర్గ.

"అదేవిటే ఇప్పుడేం కొంపలు మునిగాయని యాగీ చేస్తున్నావ్?" లో గొంతు కలో ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ తెల్పింది తల్లి సక్కుబాయి.

"నీలాంటి ఓపికా శిఖామణులుంటం వల్లే మా బతుకులిలా తగలడ్డాయి." తల్లి మాటలు మరింత ఉడికించాయి దుర్గను.

మరో మాట మాట్లాడి, ఇంకో మాట అనిపించుకోటం ఇష్టం లేక, దుర్గ మాటలు విననట్టే గదిలోకి వెళ్ళింది సక్కుబాయి. బెడ్ మీద దిండులో మొహం దాచుకొని పడుకొనుంది శాంభవి, సక్కుబాయి పెద్దకూతురు.

"శ్యామా! ఏమయ్యిందే?"

తల్లి చల్లని స్పర్శతో అంతవరకు గుండె గూటిలో గూడుకట్టుకున్న దుఃఖ మేఘం, కన్నీరై వర్షించింది. ఎక్కిళ్ళ తోడుగా ప్రవహిస్తున్న ఆ నీటిని ఆప్యాయంగా తనలో దాచుకుంటోంది, దిండు.

కన్నతల్లి సక్కుబాయి కూతురు స్థితికి చలించిపోయింది.

"శ్యామా! సంసారమన్నాక ఎన్నో ఉంటాయమ్మా! ప్రపంచంలోని ఏ ఇద్దరి ఆలోచనలూ ఒకేలా ఉండవు. అల్లుడుగారు మంచోరే. ఏదో ఒక బలహీనత ఉంటే మనమే సర్దుకుపోవాలమ్మా. కాపురం నిలబెట్టుకోటం, పడగొట్టుకోటం మన చేతుల్లో ఉంటుంది..."

"హల్లో..." జరగబోయే సీన్‌ని ముందే ఊహించి, సడెన్‌గా ఎంటరయ్యింది దుర్గ. "ఇక ఆపుతావా? అసలు నిన్ననాలే...మమ్మల్నిలా పెంచినందుకు. నీలాంటి వాజమ్మలుండబట్టే స్త్రీ జాతి ఇంత బలహీనంగా మారుతోంది. రోజుకు వందల మంది మగరాయళ్ళ ఆకృత్యాలకు బలి అవుతోంది. ఇంకా ఎన్నాళ్ళిలా పిరికిమందు నూరిపోస్తూ, మా బతుకులు బుగ్గి చేస్తారు?"

దుర్గకు ఎదురు నిలవడం చేతగాని సక్కుబాయి తనలో తనే గొణుక్కుంటూ ఏదో పని ఉన్నట్టు వెళ్లిపోయింది అక్కడి నుంచి.

"హు!" విసుక్కుంటూ అక్కవైపు తిరిగింది.

"ఊ! నీ సంగతేంటే పుణ్యాధరిత్రీ! నిన్న రాత్రి దాకా మొగుడుగారి హింసలు భరించలేనని, మళ్ళీ వానింటి మొగం కూడా చూసేది లేదని, నీ యాతనలన్నీ ఊదరగొట్టి... అంతా అయ్యాక ఇప్పుడేంటే సడెన్‌గా పొలిటీషయన్లా ప్లేటు ఫిరాయించేశావ్?" నిలదీసింది శాంభవిని.

చెల్లి మాటలు కంగారు పెట్టాయామెని. 'నా సంసారం గొడవలన్నీ దీంతో చెప్పుకోటమే బుద్ధి తక్కువ. ఇదేదో సలహా యిస్తుందనుకుంటే 'కోతిపుండు బ్రహ్మాండం'లా మార్చేట్టుంది. "ఛ!" చివరిమాట మాత్రం బయటికనేసింది.

"ఏంటీ? "ఛా" గుణింతాలు మొదలెట్టావ్? ఇలాంటివన్నీ ముందే నిర్ణయించుకోవాలే. ఇలా నువ్వు పరేషానైపోయి, అందర్నీ ఫూల్స్‌ని చెయ్యొద్దు. అయినా ఆ శాడిస్టు వెధవతో ఇంకా కొనసాగాలనుకునే నువ్వేం మనిషివే?" ఛీత్కరించింది.

"దుర్గా! నీకు తెలీదే. ఆయన మంచివాడు కాదు. కాని ఈ సమాజంలో ఎంతోమంది మగాళ్ళ కన్నా మెరుగే. సంఘానికి హక్కులు తప్ప బాధ్యతలుండవ్. మన కట్టుబాట్లు మనకొక్కోసారి ఉరితాళ్ళలా అనిపించవచ్చు. కాని అవి లేకుంటే మనం దారం లేని గాలిపటాలమే."

"జగన్‌తో కలిసి బతకటం నాకిష్టం లేదు. కాని, విడిగా బతకటం అంతకంటే హీనంగా ఉంటుందనేది నిజం. మన సమాజాన్ని పాశ్చాత్యులతో పోల్చుకోటం సరికాదు. అలాగని పాతరాతియుగం పద్ధతులనంగీకరించనవసరం లేదు" అపర దుర్గ లాంటి ఫోజులో ఉన్న దుర్గమొహం చూడగానే శాంభవి వాక్ప్రవాహమాగి పోయింది.

"ఏంటీ ఆపేశావ్? నువ్వు టీచరువిగదే, నోరు విప్పితే నలభై నిమిషాలు ఏకధాటిగా కొనసాగాలే?" ప్రతి మాటకూ వ్యంగ్యం రంగు రుద్దింది దుర్గ.

దుర్గమాటల్తో లేని తెగింపు వచ్చేసింది శాంభవిలో, "దుర్గా! నువ్వు నన్ను వెక్కిరించినా బాధలేదు. కాని, తెలిసీ తెలియని జ్ఞానంతో సమస్యను జటిలం చేయకు. నా చావేదో నేను ఛస్తాను ప్లీజ్!"

క్షణం బిత్తరపోయింది దుర్గ - "శ్యామా! ఏంటే నువ్ మాట్లాడుతున్నది? నేనిప్పుడే చెబుతున్నా, స్వయంప్రభ మేడం వాళ్ళ దగ్గర నా పరువుపోయే పనులు చేయకు. ఆ తర్వాత ఇంతకింత బాధపడాల్సొస్తుంది" తర్జని చూపింది.

నిన్నటిరోజంతా కష్టపడి, ప్రేరణ మహిళాసంఘం వాళ్ళతో కల్సి మాట్లాడి, తర్వాత కార్యాచరణ విషయమై సంఘకార్యదర్శి స్వయంప్రభను ఇంటికాహ్వానించింది. ఏదో ఒకటి చేసి, మహిళా చైతన్యాన్ని నిరూపించాలన్న తన ఆలోచనలు అక్క నిర్ణయంలోని బలహీనతకు బలైపోతాయేమోనన్న ఆందోళన ఆమెను కుదిపేస్తోంది.

మొదడు నిండా తేనెటీగల్లా ఆలోచనలు. రెండ్రోజులుగా వెక్కిరిస్తున్న నిద్రాహారాలు. మనస్సును చంచలంగా, శరీరాన్ని చైతన్యహీనంగా మారుస్తోంటే నిస్సత్తువగా మంచం మీద వాలిపోయింది శాంభవి. అంతలో...

ఏదో కలకలం... అమ్మ పలకరింపు....విసురుగా దుర్గ బయటికెళ్ళిపోటం... పరిచయమైన ఏదో అడుగుల సవ్వడి...

లేవాలన్న ఆలోచనని బలవంతంగా అదిమిపెట్టి, భావరహితంగా ఉండిపోయింది.

"భవ్యా!"

ఉలిక్కిపడింది శాంభవి. వెన్నెలను తలపించే ఆ పిలుపు సుపరిచితం, గతి తప్పిన మేని వీణను శృతి చేసిన అనుభూతి ఆమె హృదయాన్ని కదిలించింది.

దిగ్గున లేచింది.

"ఏవండి!...'అనబోయింది. ఏదో బలీయమైన శక్తి ఆమె గొంతును పెగలనీయలేదు. మరుక్షణం ఒక్క నిట్టూర్పు విడిచి, జడపదార్ధంలా ఉండిపోయింది.

"భవ్యా!" చొరవగా మంచం మీద కూర్చుంటూ పిలిచాడు జగన్. (అతడామెకు పెట్టుకున్న ముద్దు పేరది)" అయామ్ సారీరా! నీకు తెలుసు కదా! తాగినపుపడు నేను కొంచెం అదుపు తప్పుతానని. కాని, ఆ రోజు నేను చాలా తప్పుచేశాను, నీ... నీ... ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాను. కాని భవ్యా! నిజం! నీవు లేకుండా నేను బ్రతకలేను. నన్ను క్షమించలేవా?

"హలో! బావా!" సర్రున దూసుకొచ్చింది దుర్గ.

"నువ్వేదైనా మాట్లాడదల్చుకుంటే కోర్టులో మాట్లాడు. నీ మాయమాటల్తో దాన్ని మళ్ళీ మళ్ళీ హత్యచేయెద్దు. ఉడ్ యు ప్లీజ్ గెట్ అవుట్"

"ఛెళ్" దుర్గ మాటపూర్తాకాకుండానే చెంపపేలిపోయింది.

"ఏమిటే తెగనీలుగుతున్నావ్? నోర్మూసుకొని బయటకు నడువ్ ముందు. పేనుకు పెత్తనమిస్తే తలంతా తెగకొరికిందని, నీ బోడిపెత్తనం ఇక్కడవసరం లేదు" అపరదుర్గలా అరిచింది, సక్కుబాయి.

"అమ్మా!" దెబ్బతిన్న నాగుపాములా బుసకొట్టింది దుర్గ.

"ఇంత జరిగింతర్వాత అదెలా వెళ్తుందో నేను చూస్తా" గుడ్లనీళ్ళు గుక్కుకుంటూ చెంప తడుముకుంటూ బయటికెళ్ళిపోయింది.

"భవ్యా!" చివరి అర్థింపుగా జగన్.

"ప్లీజ్! మీకు దణ్ణం పెడతాను. నేనిక్కడే ఉంటాను. ఇంకెప్పుడూ రావద్దు!" రుద్ధమైన కంఠంతో అరిచి, దిండులో తలదాచుకుంది మళ్ళీ శాంభవి.

* * *

"నువ్వెందుకురా అనవసరంగా బాధపడ్తావ్! నీ మెత్తదనాన్ని చూసే అదలా రెచ్చిపోతోంది. అందమంటే అదే అన్నంత ఇదిగా దాని చుట్టూ తిరిగి నెత్తినెక్కించుకున్నావ్. చిలక్కి జెప్పినట్టు జెప్పాను. అది కాపురంజేసే రకం గాదురా నాయనా! అంటే విన్నావా? ఇప్పుడేం జరిగింది? ఎగురుకుంటూ ఎల్లావు, ఏడుస్తూ వచ్చావు.

చెప్పగా వినకపోతే చెడిపోగా జూడమన్నారు. అనుభవించు" జగన్ తల్లి సదాలక్ష్మి వగర్చింది.

"అమ్మా నువ్ నోర్మూస్తావా?" అసహనంగా అరిచాడు జగన్.

"ఔన్రా! తల్లి అల్లమే మరి. అది(పెళ్ళాం) కాలితో తన్నినా కళ్ళకద్దుకుంటావ్. నేను కళ్ళలో పెట్టుకున్నా కుళ్ళబొడుస్తావ్. నువ్వే గనక నా మాట వినుంటే ఇందాకా వచ్చేదా? హుఁ! ఎవ్వర్ననేం లాభం? నారాత బాగా లేనప్పుడు...." ఆర్నొక్క రాగం శృతి జేయసాగింది - షరామామూలుగా సదాలక్ష్మి.

"ఏమైంది పెద్దమ్మా!" సమయానికి ఊడిపట్టం సమీర్ ప్రత్యేకత. ఆప్యాయత లొలకబోసి అయినవాణ్ణనిపించుకోటం, చెట్లెక్కించి శెభాషనించుకోటం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

"ఇంకా ఏం గావాలిరా నాయనా! నా శ్రాద్ధం, నా పిండాకూడునూ. ఇలాంటి చేతగాని వెధవల్ని కన్నందుకు తప్పుతుందా?" మిర్చికి మసాలా తోడైనట్లు సదా లక్ష్మి ఏడుపుకి అదనపు కళ వచ్చేసింది.

"ఏంటి పెద్దమ్మా అంతంత పెద్ద మాటలంటావ్. వాడి సంగతి నేను జూసుకుంటాగాని, బాగా ఆకలిగా వుంది, వేడివేడిగా ఏదైనా చేసిపెట్టు" ఆత్మీ యతను చుట్టిన మాటల బాణాన్ని ఆమెపై సంధించి, మిత్రుడికి 'స్త్రీబుద్ధీ ప్రళయాంతకం' అనే అంశంమీద ఉపన్యాసం మొదలెట్టాడు...

అలా సోదాహరణ వివరణ అయ్యాక "కాబట్టి ఆర్నూరయినా సరే నువ్వు ఆ గడపదొక్కేది లేదు. నువ్వేంటిరా మా రాజువి. 'కో' అంటే కోటి మంది క్యూలో నిలబడ్తారు. ఆర్నెల్లు ఓపికపట్టు. అంతకంటే అందమైన అమ్మాయితోపాటు అదనపు కట్నమూ వస్తుంది. శాంభవి తిక్క కుదుర్తుంది" అంటూ ముక్తాయింపు నిచ్చాడు.

పకోడీలు వేయిస్తూ అంతా వింటున్న సదాలక్ష్మి సమీర్ బోధలకు సంబర పడిపోయి మరిన్ని పకోడీలు అదనంగా పెట్టి, కొసమెరుపుగా మెటికలు విరిచింది.

* * *

కాలం మహత్తరమైంది. సదాలక్ష్మి కోరుకున్నట్టు కొడుకూ కోడలికి విడాకులు మంజూరు కాలేదు. దుర్గ అనుకున్నట్టు జగన్ని కోర్టుకీ లాగలేదు. సమీర్ ప్రమేయంతో లాయర్ శఠగోపం రంగ ప్రవేశం చేసి, కోర్టు బయటే గుట్టుచప్పుడు కాకుండా ఇద్దర్నీ విడదీసి ఎవరింట వాళ్ళుండే ఏర్పాటు చేశాడు. ఓ యేడాది

గడువులో కట్నం డబ్బులో సగం - అంటే లక్షా ఇరవైవేలు జగన్ శాంభవికి ఇచ్చేట్టు అగ్రిమెంటు రాయించి, ఒహాళ్ళ మీద మరొకరికి అధికారం లేకుండా గీత గీసేశాడు.

"శ్యామా! మీట్ మిస్టర్ వసంత్!" దుర్గ ఎవరో యువకుడ్ని పరిచయం చేసింది.

"నమస్తే!" ఏదో ఆలోచిస్తున్న శాంభవి కంగారుగా కుర్చీలోంచి లేచింది.

"నేను చెప్పానే గోల్డెన్ బ్యూటీ! ఇదే మా అక్క" హుషారుగా అంది దుర్గ. అతను కాస్త నలుపే. కాని ఆకర్షణీయమైన విగ్రహం. కోలమొహం. పై పెదవిని పూర్తిగా కప్పేస్తున్న మీసాలు. నవ్వితే మరింత అందంగా ఉన్నాడు. అతను తినేసేట్టు తననే చూస్తున్న సంగతి గ్రహించి ఇబ్బంది పడింది శాంభవి.

"చూశావుగా, వీడికి ఆ జగన్‌గాడికున్నట్టు, భార్యను బాధపెట్టే శాడిజం లేదు. మందు అసలే ముట్టడు. నైస్ గాయ్."

'ఇదంతా తనకెందుకు చెబుతోంది, అసలేమిటి దీని ఉద్దేశ్యం? కొంపదీసి నాకుగాని...'

"ఏంటే అలా కొయ్యబారి పోయావ్? నచ్చలేదా?" బొమ్మలెగరేసింది దుర్గ.

ఏదో భయం, అనుమానం, అయోమయం శాంభవిలో.

"అయినా, నీకు నచ్చడం, నచ్చకపోవడంతో నాకేటి? నాకు నచ్చాడు. మేమిద్దరం ఒకటయ్యాం. హి యీజ్ మై ఉడ్ బి...ఛ! ఉడ్ బీ ఏంటి, నా బొంద, హి యీజ్ మై పార్టనర్... మీ భాషలో చెప్పాలంటే, హి యీజ్ మై హజ్బెండ్."

తాను వింటున్నది నిజమో కాదో నమ్మలేని జడత్వంలోకి జారిపోయింది శాంభవి. లోపలి గదిలో నుండి అంతా వింటున్న సక్కుబాయి మనసు ఏదో కీడును శంకిస్తుండగా గబగబా అక్కడికి వచ్చింది. తల్లి రాకను గమనించిన దుర్గకు కొత్త హుషారొచ్చేసింది.

"బానిస బతుకులకు, ఛాందసభావాలకు అతీతంగా మేం కలిసుంటున్నాం. స్వేచ్ఛగా, ప్రేమగా ఒకరికొకరం తోడుగా ముఖ్యంగా బానిసలం కాకుండా బతుకదలచాం. ఎవరంగీకరించినా, అంగీకరించకపోయినా మాకనవసరం.

"ముందు ఇక్కడే ఉండాలనుకున్నాం. కాని రెండున్నర గదుల కొంపలో మాకు ప్రైవసీ ఉండకపోవడమేగాక, ఆచారాలు పట్టుకు వేళ్ళాడే వాళ్ళకు ఇబ్బందిగా ఉంటుందని, వేరుగానే ఉండేందుకు నిర్ణయించుకున్నాం. ఈ రాత్రి కాగానే మా దారిన మేమెళ్లిపోతాం. మీకు మనసుంటే ఆశీర్వ... నోనో అభినందించండి. లేదా మానుకోండి. వుయ్ నెవర్ కేర్..."

దుర్గ అలా మాట్లాడుతుంటే, అయిదంతస్థుల ఆ మహాభవనంలోని సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఒంటరిగా ఫీలవుతూ ఉక్కిరిబిక్కిరికాసాగింది.

* * *

బస్సులోకెక్కిన శాంభవికి అనుకోకుండా ఆ దృశ్యం కళ్లబడింది. వెంటనే దిగిపోదామనుకునేంతలో బస్సుస్టార్టయ్యింది. వద్దు వద్దనుకుంటూనే మరో మారు అటు చూసింది.

అనుమానం లేదు. అతను జగనే. పక్కనే ఓ ఆడమనిషి. భార్యా...? కావచ్చు. చేతుల్లో ఓ చిన్నపాప...

మనసునో గుడ్డపీలికను చేసి, చిరిగిపోయేలా పిండేస్తున్న భావన. పుండు మీద కారంలా అతను ఆమెతో పకపకలు.

కన్నీళ్ళాగలేదు శాంభవికి. గిరుక్కున మొహం తిప్పుకుంది. అదేక్షణం అతనామెను చూశాడు. అది గ్రహించి, గబగబా ఆమె ఫ్రంట్‌డోర్ వైపు నడిచింది.

"భవ్యా!" అది బస్సని, అందరూ తమని గమనిస్తున్నారనేది పట్టించుకోకుండా అరిచాడతడు. దారిలో ఉన్న వారిని తప్పించుకుంటూ వేగంగా ముందుకు రాసాగాడు.

అంతలోనే బస్సాగటం, ఆమె దిగిపోవటం వెంట వెంటనే జరిగిపోయాయి. అతను తేరుకోక ముందే బస్సు కదిలింది, మళ్ళీ.

* * *

"శ్యామా! నువ్వైనా నా మాట వినవే. మీరు చేసే పనులకు పైనున్న మీ నాన్న ఆత్మ ఎంతగా క్షోభిస్తుందో ఒక్కసారి అర్థం చేసుకో." దగ్గుతెర ముంచుకొచ్చింది సక్కుబాయికి. మూడు రోజులుగా జ్వరం తగ్గడం లేదామెకు. ప్రాణాపాయమేమీ లేదుకాని, మానసికంగా బాగా నలిగి పోయినందువల్ల నీరసానికి ప్రతిరూపంగా తయారయ్యిందామె. కాపురం చెడగొట్టుకున్న కూతురొకరు, రోజుకో సంచలనాత్మక వార్తలనందిస్తూ బతుకును దినదినగండంగా మారుస్తూ మరొకరు - ఆమెను నిద్రాహారాలకు పూర్తిగా దూరం చేశారు.

"అమ్మా! నేను మాత్రం ఇలా అవుతుందనుకున్నానా?" నెమ్మదిగా గొంతు పెగుల్చుకుంది శాంభవి. ఈ రెండేళ్ళ అనుభవాలు ఆమె జీవన గమనాన్ని అతలాకుతలం చేశాయి. ఆయనంటే నా కిష్టమే" పచ్చికుండ బద్దలైనట్టు దు:

ఖం భళ్లుమంది. అంతబాధలోనూ ఏదో ఆనందం సక్కుబాయి కళ్ళలో.

"శ్యామా! తన మీదికి ఒరిగి ఏడుస్తున్న కూతురి తలనిమిరింది.

"ఇన్నాళ్ళకి మళ్లీ మనకు మంచిరోజులొచ్చాయమ్మా. నేనిప్పుడే బయల్దేర తాను. అల్లుడిగారి మంచితనం నాకు తెలుసు. అన్నీ చక్కబడ్తాయి. నేనెళ్ళి మాట్లాడ్తాను" ఆమె ఒంట్లో కొత్త ఉత్సాహం.

చివ్వున లేచింది శాంభవి. "ఆ అవకాశం లేదమ్మా. ఆయన మరో పెళ్లి కూడా చేసుకున్నాడు." చివరి మాటలు నూతిలో నుండి వచ్చినట్టున్నాయి.

సక్కుబాయికి తాను వింటున్నది నిజంకాకపోతే బాగుండుననిపిస్తుండగా మళ్లీ నీరసం ఆవరించింది.

"ఆంటీ! లెటర్!" తెరచి ఉన్న డోర్‌ని తట్టి, పక్క ఫ్లాట్‌లోని అబ్బాయి ఓ ఉత్తరం ఇచ్చాడు. "మీదే కదా!" కన్‌ఫమ్ కాగానే వెళ్ళిపోయాడు - శాంభవి చెప్తున్న థ్యాంక్స్ అందుకోకుండానే. గబగబా కవర్‌చించి, ఉత్తరం బయటకు తీసింది.

"ప్రియమైన భవ్యకు..." వేలవిస్ఫోటనాలు శాంభవి గుండెలో. 'చదవనా-వద్దా' అంటూ తటపటాయించింది.

"ఎవర్రాశారే?" సక్కుబాయి ఆదుర్దా.

సమాధానం చెప్పలేదు, ఏదో ఓ నిర్ణయానికొచ్చినట్టు అక్షరాల వెంబడి కళ్ళను పరుగెత్తించింది..."మొన్న బస్సులో కన్పించినప్పుడే నీతో మాట్లాడాలను కున్నాను. నాకా అవకాశం ఇవ్వలేదు. నీలో ఇంకామార్పురాలేదనిపించింది. అందుకే మాట్లాడలేక ఇలా ఉత్తరం రాస్తున్నాను.

"ఈ రెండేళ్ళలో రకరకాల అనుభవాలు నన్ను కలచివేశాయి. చివరకు అమ్మ వత్తిడికి తట్టుకోలేక మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

ఆ ఒక్క వాక్యం అనుమానం వేల అనుమానాలకు తెరతీసింది. ఆపై ఆసక్తిచచ్చిపోయింది. అయినా మళ్ళీ చదవసాగింది.

"కాని, నిన్ను మరచిపోవడం నా వల్ల కావడం లేదు. భవ్యా! తొలిరేయి చేసు కున్న బాసలన్నీ చెల్లిపోయాయా? నాకున్న దురలవాటు కొద్దీ నిన్ను బాధపెట్టాను. నిజమే, నా తప్పు తెలుసుకున్నాను. క్షమించమని అడిగాను. నువ్వు కరగలేదు."

శాంభవి హృదయం దుఃఖంతో ముద్దగా మారింది. కన్నీళ్ళనాపుకునే ప్రయత్నం సఫలం కాలేదు...

"భవ్యా! నీకు గుర్తుందా, యాదగిరిలో వారం రోజులు ఆనందంగా గడుపుదామని వెళ్ళిన రెండో రోజే నువ్వు కోనేటి వద్ద కాలు జారి పడిపోటం, ఆపై జ్వరంతో మూడ్రోజులూ నువ్విబ్బంది పడ్తుంటే... భార్యాభర్తల బంధం బాధల్ని పంచుకోవ డంలోనే మాధుర్యాన్నిస్తుందని నేన్నమ్మతాను. నేనిచ్చిందానికంటే, నీ నుండి పొం దిందే ఎక్కువ. అందుకేనేమో, నువ్వు మరచినా, నిన్ను మరవలేకపోతున్నాను. అయినా చేసుకున్నోడికి చేసుకున్నంతే గదా!

"నీలో మార్పురాలేదనే సంగతి నాకర్థమైంది. చెప్పకుండా పెళ్ళి చేసుకొని శేషజీవితమంతా అపరాధభావంతో గడపలేను. ఈ నెల ఇరవైనే గుళ్ళో పెళ్ళి. భవ్యా! నాకొక అవకాశమీయవూ!"

పసిపిల్లలా వెక్కివెక్కి ఏడ్వసాగింది. ఆపై ఉత్తరం చదవలేదు.

"శ్యామా! ఎక్కడిదే ఉత్తరం?" భయం, అనుమానం,ఆందోళనతో - సక్కుబాయి.

"ఆయన దగ్గర్నుండే..." ఏదో నిర్ణయానికొచ్చినట్లు లేచింది. అయిదు నిమిషాల్లో తయారైంది.

"శ్యామా!..." జరుగుతున్నదేమిటో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ మంచంపై నుండి లేచింది - సక్కుబాయి.

"అమ్మా! నేను మా ఇంటికెళ్తున్నాను" దృఢంగా అంది.

"శ్యామా! నేను రానా?" ఆనందం, ఆశ్చర్యం - సక్కుబాయి గొంతులో.

"అక్కర్లేదు! వీలైతే నేనే రెండ్రోజుల్లో ఆయన్ని తీసు..." గుమ్మంవైపు చూసిన శాంభవి ఠక్కున ఆగిపోయింది. ఎదురుగా దుర్గ.

లైట్ఎల్లో ప్రింటెడ్ వైట్ శారిలో, మెళ్లో తాళితో, చేతిలో సూట్కేస్తో.

సక్కుబాయి కూడా వెనక్కి తిరిగి చూసి, శిలాప్రతిమే అయ్యింది.

"హలో! ఏంటలా చూస్తున్నారు. నేనే, దుర్గని. వాడ్ని నాలుగు తన్ని, మరొకడితో తాళి గట్టించుకున్నాను. వీడో పిరికి వెధవ, తాళిలేందే గడవదట, సరే, వాడికోరికెందుక్కాదనాలి. కొన్నాళ్ళు భరించి చూద్దాం. వీలుగాకపోతే మరోదారి, ఈ లోకంలో మగాళ్ళే కరువా? న్యూయేజ్ని అర్థం చేసుకునే మగాడు దొరక్కపోడు. అది సరేగాని. నువ్వెక్కడికే బయల్దేరావ్?" తన సహజ ధోరణిలో దుర్గ.

"ఆ! సినిమాకి..." తేరుకుని, వ్యంగ్యంగా అంది శాంభవి.

"ఈజీట్? అయితే నేనూ వస్తా! మిగతా సంగతులు వెళ్తూ మాట్లాడుకుందాం..."

"షటప్!" గట్టిగా అరిచింది శాంభవి. "నీ తిక్క వ్యవహారాలతో మతులు పోగొట్టింది చాలు."

"ఆధునికతంటే విచ్చల విడితనం కాదే, మంచిని ఆహ్వానించడం అది మనకూ ఎదుటివాళ్ళకూ మేలు చేసేదై వుండాలి. ఏదైనా దేశాన్ని, కాలాన్ని సమాజాన్ని అనుసరించే ఉండాలికాని, విపరీతంగా ఉండకూడదు. అన్నీ తెలిసి నీ మాయలో పడిపోయి ఇప్పటికే చాలా నష్టపోయాను.

"నేను మా ఆయన దగ్గరికెళ్తున్నాను. పరిత్యక్తగా అడవిలో గడిపే త్రేతాయుగపు సీత పాత్ర ఇప్పుడు చెల్లుబాటుకాదు. ఇపుడు కన్నీరు కార్చడానికి పరిమితంకాను. కాంప్లిమెంటరీగా సమన్వయపరచుకొనడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండే గృహలక్ష్మిగానే వ్యవహరిస్తాను. సందర్భానుసారంగా సమస్త ఉపాయాలనూ ప్రయోగిస్తాను. దారి తప్పకుండా, నష్టం జరగకుండా చూసుకుంటాను. నాదైన మోడల్‌ని నేను ఆవిష్కరించుకుంటాను."

రెండడుగులు ముందుకేసి ఆగి వెనక్కి తిరిగింది.

"ఇదుగో! ఒకసారి నిన్ను నీవు మనస్సనే అద్దంలో చూసుకో. అర్థంలేని ప్రయోగాలు మానుకో. లేకపోతే తెగిన గాలిపటంలా అన్ని విధాలా నష్టపోతావ్!" చెల్లిని మరోసారి హెచ్చరించి గుమ్మంవైపు అడుగులేసింది శాంభవి.

**(16-02-2003 జాగృతి సచిత్ర వారపత్రిక)**